అనుమతి పొందిన కాంటాలనే వాడాలి

- జిల్లా తూనికలు, కొలతల అధికారి వెంకటేశ్వర్లు

ధాన్యం తూకం వేసే యంత్రాలను పరిశీలిస్తున్న జిల్లా తూనికలు, కొలతల అధికారి వెంకటేశ్వర్లు

ఆత్మకూరు(ఎం), మార్చి 27 : పీఏసీఎస్ ఆధ్వర్యంలో మండలంలోని వివిధ గ్రామాల్లో త్వరలో ప్రారంభించనున్న ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో సంబంధిత జిల్లా అధికారుల నుంచి అనుమతి పత్రాలు పొందిన తూకం యంత్రాలను మాత్రమే వాడాలని జిల్లా తూనికలు, కొలతల అధికారి వెంకటేశ్వర్లు అన్నారు. మండల కేంద్రంలోని పీఏసీఎస్ కార్యాలయంలో కొనుగోలు కేంద్రాల కోసం సిద్ధంగా ఉంచిన కాంటాలను గురువారం పరిశీలించి ప్రతి యంత్రానికి సీజ్ చేసి ముద్ర వేశారు. కొనుగోలు కేంద్రాల్లో తప్పుడు తూకం వేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రోజూ యంత్రాలకు చార్జింగ్ పెట్టిన తర్వాతే తూకం వేయాలన్నారు. ధాన్యం కొనుగోలు దారులు రైస్ మిల్లర్లతో కుమ్మక్కై తప్పుడు తూకం వేసి రైతులను మోసం చేస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఆయన వెంట కార్యాలయం సీఈఓ యాస కిరణ్ రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ సింహాద్రి ఉన్నారు.

ఏప్రిల్ 3న బార్ అసోసియేషన్ ఎన్నికలు

నామినేషన్లు స్వీకరిస్తున్న ఎన్నికల అధికారులు

చౌటుప్పల్, మార్చి 27 : చౌటుప్పల్ బార్ అసోసియేషన్ ఎన్నికలు ఏప్రిల్ 3న జరుగనున్నాయి. ఇందుకోసం గురువారం అధ్యక్ష పదవికి బాల్యం వెంకటచలపతి, ఉపాధ్యక్ష పదవికి రాపోలు వేణు, ప్రధాన కార్యదర్శి పదవికి పడమటి మహిపాల్‌రెడ్డి, కోశాధికారి పదవికి జెల్లా రమేశ్, స్పోర్ట్స్ అండ్ కల్చర్ సెక్రటరీ పదవికి దేశగోని శ్రీశైలం, మహిళా ప్రతినిధిగా నకిరేకంటి జ్యోతి, కార్యవర్గ సభ్యులుగా మహ్మద్ ఖయ్యూం పాషా, పి.కిరణ్ నామినేషన్లు దాఖలు చేశారు. శుక్రవారం నామినేషన్లకు చివరి గడువు కాగా, 29న పరిశీలన చేయనున్నారు. ఏప్రిల్ 1న నామినేషన్ల ఉపసంహరణ, 3న ఎన్నికలు, కౌంటింగ్ నిర్వహించనున్నారు. ఎన్నికల అధికారులుగా కానుగుల వెంకటయ్య, చెన్నూరు రాధాకిషన్‌రావు వ్యవహరించనున్నారు.

విద్యార్థులు క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలి : ఎంఈఓ

విద్యార్థులకు జామెట్రీ బాక్స్‌లు అందజేస్తున్న ఎంఈఓ భాస్కర్

వలిగొండ, మార్చి 27 : విద్యార్థులు చదువుతోపాటు క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలని మండల విద్యాధికారి సుంకోజు భాస్కర్ అన్నారు. మండలంలోని నాగారం గ్రామ ప్రాథమికోన్నత పాఠశాలను గురువారం ఆయన సందర్శించి విద్యార్థుల పఠన సామర్థ్యాన్ని పరిశీలించారు. ఏడో తరగతి విద్యార్థులకు జామెట్రీ బాక్స్‌లను అందజేసి మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉచితంగా నాణ్యమైన విద్య అందుతుందన్నారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకొని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జీవనజ్యోతి, గులాం జిలానీ, స్వామిరాజ్ పాల్గొన్నారు.

'ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో నాణ్యత పాటించాలి'

ఆత్మకూరు(ఎం), మార్చి 27 : మండలంలోని తిమ్మాపురంలో లబ్ధిదారులు నిర్మించుకుంటున్న ఇందిరమ్మ ఇండ్లను తాసీల్దార్ లావణ్య, ఎంపీడీఓ రాములునాయక్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇండ్ల నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలన్నారు. ఇంటి నిర్మాణం కోసం అవసరమయ్యే ఇసుక, సిమెంట్, ఇనుమును వ్యాపారులు తక్కువ ధరకు అందించాలని సూచించారు.

లబ్ధిదారులు త్వరగా ఇండ్ల నిర్మాణాన్ని పూర్తి చేయాలన్నారు. వారి వెంట ఆర్ఐ మల్లికార్జున్‌రావు ఉన్నారు.

ఇంటి పన్నులు చెల్లించి గ్రామాభివృద్ధికి సహకరించాలి

ఇంటి పన్ను వసూలు చేయిస్తున్న ఎంపీఓ అనూరాధ

ఆలేరు రూరల్, మార్చి 27 : ప్రతిఒక్కరూ ఇంటి పన్నులు చెల్లించి గ్రామాభివృద్ధిలో భాగస్వాములు కావాలని మండల పంచాయతీ అధికారి అనూరాధా దేవి అన్నారు. మండలంలోని కొలనుపాకలో గురువారం ఇంటి పన్ను వసూలు ప్రత్యేక క్యాంప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ఇంటి, నల్లా పన్నులు విధిగా చెల్లించాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి చింతకింది రామకృష్ణ, కారోబార్లు షమీర్, మామిడాల నర్సింహులు, ఆకుల శ్రీనివాస్, మామిడాల రాములు పాల్గొన్నారు.

ఆహార కల్తీ, చెట్ల పెంపకంపై ప్రయోగాలతో అవగాహన

చెట్ల వల్ల ఉపయోగాలను విద్యార్థులకు వివరిస్తున్న పాఠశాల హెచ్ఎం వెంకన్న

ఆత్మకూరు(ఎం), మార్చి 27 : మండలంలోని కొరటికల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఆహార కల్తీ, చెట్ల పెంపకంపై హెచ్ఎం దడిపల్లి వెంకన్న గురువారం ప్రయోగాలతో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులను గ్రామంలోని పల్లె ప్రకృతివనం, నల్ల చెరువును చూపించి చెట్లు, చెరువు వల్ల కలిగే ఉపయోగాలను వివరించారు. భూ ప్రపంచానికి మొక్కే దిక్కు అంటూ ప్రతిఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని అన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నరేందర్‌రెడ్డి, ఉపాధ్యాయులు స్వామి, వరప్రసాద్, శ్రీనివాసాచారి, అనూరాధ, వెంకటేశం పాల్గొన్నారు.

'హై టెన్షన్ వైరు కింద నిర్మాణాలకు పర్మిషన్ రద్దు చేయాలి'

భువనగిరి కలెక్టరేట్, మార్చి 27 : బీబీనగర్ మండలంలోని నెమరుగోముల గ్రామంలో సర్వే నంబర్ 53 పార్ట్, 57 పార్ట్‌లలో హై టెన్షన్ వైరు కింద రాత్రికి రాత్రి ఇంటి నిర్మాణం చేపట్టారని, వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ గ్రామానికి చెందిన సంకూరి శ్రీకాంత్ గురువారం కలెక్టర్ హనుమంతరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందుకు అధికారులు సహకరిస్తూ కరెంట్ మీటర్, నల్లా కనెక్షన్ అందజేశారని తెలిపారు. ఇంటి నిర్మాణంపై గ్రామ పంచాయతీ కార్యదర్శికి తెలిపినా ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. నిర్మాణానికి సహకరించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

నేడు సింగిల్ విండో సర్వసభ్య సమావేశం

చౌటుప్పల్, మార్చి 27 : చౌటుప్పల్ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం సర్వసభ్య సమావేశం శుక్రవారం ఉదయం 11గంటలకు నిర్వహిస్తున్నట్లు సంఘం సీఈఓ వై.రమేశ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సంఘం ఆవరణంలో సింగిల్‌విండో పర్సనల్ ఇన్‌చార్జి చైర్మన్ చింతల దామోదర్‌రెడ్డి అధ్యక్షతన సమావేశం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. సమావేశానికి సంఘం సభ్యులు, రైతులు సకాలంలో రావాలని ఆయన కోరారు.

కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయాలి

- ఆలేరు మున్సిపల్ మాజీ చైర్మన్ పస్పరి శంకరయ్య

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ మాజీ చైర్మన్ శంకరయ్య

ఆలేరు టౌన్, మార్చి 27 : కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ఆలేరు మున్సిపల్ మాజీ చైర్మన్ వస్పరి శంకరయ్య అన్నారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం కాళేశ్వరం నీళ్లు విడుదల చేయకపోవడంతో పంటలు ఎండిపోయాయని, రైతులకు పంట నష్టపరిహారం కింద ఎకరాకు రూ.25వేలు చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నియోజకవర్గంలో రైతులకు రూ.2లక్షల రుణమాఫీ కాలేదని, ఎకరాకు రూ.15వేల రైతు భరోసాను ప్రభుత్వం విస్మరించిందని అన్నారు. ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ఎండిపోయిన పంటలను పరిశీలించి రైతులను ఆదుకోవాలని సూచించారు. విద్యార్థుల పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలని కోరారు. ఆలేరు ప్రాంతంలో మిషన్ భగీరథ నీళ్లు సరిగా రాక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. హామీలను నెరవేర్చే వరకు బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు పుట్ట మల్లేశం గౌడ్, నాయకులు వెంకటేశ్, కృష్ణ, బాలస్వామి, శ్రవణ్ కుమార్, వెంకటేశ్ పాల్గొన్నారు.

పోచంపల్లి నుంచి జిల్లా కేంద్రానికి డబుల్ రోడ్డు వేయాలి : సీపీఎం

పెద్దరావులపల్లి నుంచి పోచంపల్లి వరకు పాదయాత్ర చేస్తున్న సీపీఎం నాయకులు

భూదాన్ పోచంపల్లి, మార్చి 27 : పోచంపల్లి నుంచి భువనగిరి జిల్లా కేంద్రానికి వెళ్లే రేవణపల్లి, పెద్ద రావులపల్లి వరకు రోడ్డుపై ఏర్పడ్డ గుంతలకు మరమ్మతులు చేపట్టి డబుల్ రోడ్డుగా మార్చాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు కొండమడుగు నర్సింహ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. డబుల్ రోడ్డుగా మార్చాలని, మండలంలో నెలకొన్న ప్రజా సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గురువారం పెద్దరావులపల్లి నుంచి పోచంపల్లి తాసీల్దార్ కార్యాలయం వరకు పార్టీ మండల, పట్టణ కమిటీల ఆధ్వర్యంలో పాదయాత్ర నిర్వహించారు. అనంతరం తాసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డబుల్ రోడ్డుతో జిల్లా కేంద్రానికి వెళ్లే వారికి 8కిలోమీటర్ల దూరం తగ్గుతుందని, టోల్ ప్లాజా సమస్య తీరుతుందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు, ఇండ్ల స్థలాలు, రేషన్ కార్డులు, పెన్షన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని 50 పడకల దవాఖానాగా ఏర్పాటు చేసి 24గంటల వైద్యాన్ని అందించాలన్నారు. మూసీ కాల్వలపై బ్రిడ్జీల నిర్మాణం చేపట్టాలని, మండలానికి గోదావరి జలాలు అందించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఇన్‌చార్జి తాసీల్దార్ నాగేశ్వర్‌రావుకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం సీనియర్ నాయకుడు గూడూరు అంజిరెడ్డి, మండల కార్యదర్శి కోట రామచంద్రారెడ్డి, పట్టణ కార్యదర్శి దుబ్బాక జగన్, నాయకులు లింగారెడ్డి, మధు, విష్ణు, బుచ్చిరెడ్డి, జ్యోతి, యాదగిరి, లక్ష్మయ్య, కృష్ణ, కృష్ణారెడ్డి, జంగయ్య, భిక్షపతి, పుష్పలత, కమలమ్మ, అశోక్, జంగారెడ్డి, అశోక్, మల్లారెడ్డి, రమేశ్, సత్తయ్య, రామచంద్రారెడ్డి, వీరారెడ్డి, రాజు, అనసూయ పాల్గొన్నారు.

29న ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు

భువనగిరి కలెక్టరేట్, మార్చి 27 : జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులకు ప్రైవేట్ రంగంలో ఉద్యోగాలు కల్పించడానికి జిల్లా ఉపాధి కల్పన శాఖ ఆధ్వర్యంలో ఫాక్స్‌కాన్ ఇంటర్ కనెక్ట్ టెక్నాలజీస్ హైదరాబాద్ సంస్థలో 200 పోస్టులకు ఈ నెల 29న ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి పి.సాహితి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత, ఆసక్తి ఉన్న నిరుద్యోగ యువత తమ బయోడేటా లేదా రెజ్యూమ్‌తోపాటు విద్యార్హతల సర్టిఫికెట్ల జీరాక్స్ కాపీలతో జిల్లా ఉపాధి కల్పనా కార్యాలయం, రూమ్ నెంబర్ ఎఫ్-8లో 29న ఉదయం 11:00 గంటలకు ఇంటర్వ్యూలకు హాజరు కావాలని సూచించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

యాదగిరిగుట్ట, మార్చి 27 : రోడ్డుపై వెళ్తున్న యువకుడిని ఢీకొట్టిన ప్రమాదంలో బైక్ నడుపుతున్న వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన మండల పరిధిలో గురువారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. మండలంలోని గౌరాయిపల్లి గ్రామానికి చెందిన కైరంకొండ హరీశ్ (26) తన దిచక్ర వాహనంపై యాదగిరిగుట్ట నుంచి స్వగ్రామానికి వస్తున్నాడు. మాసాయిపేట గ్రామ పరిధిలో రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న యువకుడిని వెనుక నుంచి అతివేగంతో ఢీకొట్టాడు. యువకుడు వరి పొలంలో పడడంతో స్వల్పగాయాలతో బయటపడ్డాడు. ద్విచక్ర వాహనం నడుపుతున్న హరీశ్ రోడ్డుపై పడటంతో తలకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికుల సహాయంతో 108 అంబులెన్స్‌లో భువనగిరి ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

పెట్రోల్ బంక్‌లో 2 బైక్‌లు దగ్ధం

బంక్‌లో దగ్ధమైన బైకు

ఆలేరు రూరల్, మార్చి 27 : రెండు ద్విచక్ర వాహనాలను గుర్తు తెలియని దుండగుడు దగ్ధం చేశాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కొలనుపాక గ్రామంలో గల గాయత్రి ఫిల్లింగ్ స్టేషన్‌లో బక్క నరేశ్, నల్ల పరశురాములు పనిచేస్తున్నారు. రోజులాగే బంక్‌లో వారి బైక్‌లను పార్క్ చేశారు. గురువారం రాత్రి వరకు పనిచేసి అక్కడే రూములో నిద్రపోయారు. తెల్లవారుజామున చూసేసరికి బైక్‌లు పూర్తిగా దగ్ధమయ్యాయి. బాధితుల సమాచారంతో సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు పంచనామా చేశారు. బంక్ యజమాని పాండు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రజనీకర్ తెలిపారు.

దుర్గాదేవి ఆలయాల్లో చోరీ

చౌటుప్పల్ రూరల్, మార్చి 27 : మండలంలోని ఎస్ లింగోటం, పంతంగి గ్రామాల్లోని దుర్గాదేవి ఆలయాల్లో బుధవారం రాత్రి దొంగలు చోరీకి పాల్పడ్డారు. గ్రామ ప్రజలు గురువారం ఉదయం గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. దేవాలయంలోని హుండీని పగులగొట్టి డబ్బులు ఎత్తుకెళ్లినట్లు చౌటుప్పల్ పోలీస్‌స్టేషన్‌లో గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. ఎస్ లింగోటం గ్రామ పరిధిలలోని దేవాలయంలో సీసీ కెమెరాలు ఉండటంతో చోరీకి పాల్పడ్డ వారి ఆనవాళ్లు రికార్డు అయ్యాయి. అదేవిధంగా, ఎస్ లింగోటం గ్రామ పరిధిలోని బావుల వద్ద మోటారు వైర్లు చోరీ అయ్యాయి. గ్రామస్తుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి ఆలయాల్లో పంచనామా నిర్వహించారు.

ఎస్.లింగోటం దుర్గాదేవి ఆలయంలో పరిశీలిస్తున్న పోలీసులు

బెంగుళూరు బేకరీలో మున్సిపల్ అధికారుల తనిఖీ

బేకరీలో తనిఖీ చేస్తున్న మున్సిపల్ అధికారులు

చౌటుప్పల్, మార్చి 27 : పట్టణంలోని తంగడపల్లి రోడ్డులో ఉన్న బెంగుళూరు బేకరీలో మున్సిపల్ కమిషనర్ కోమటిరెడ్డి నర్సింహారెడ్డి ఆదేశాల మేరకు అధికారులు గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. బేకరీలో ప్లాస్టిక్ కవర్లు వాడుతున్నట్లు, గడువు ముగిసిన తిను బండారాలను, మరికొన్నింటికి లేబుల్స్ లేవని గుర్తించారు. వ్యాపార లైసెన్స్ కూడా లేదని తనిఖీలో తేలింది. దీంతో దుకాణ యజమానికి రూ.5వేల జరిమానా విధించినట్లు మున్సిపల్ మేనేజర్ శ్రీధర్‌రెడ్డి తెలిపారు. తనిఖీల్లో శానిటరీ ఇన్‌స్పెక్టర్ హనుమాన్ ప్రసాద్, అధికారులు రఘుపతి, లింగయ్య, నర్సింహ పాల్గొన్నారు.

'మున్సిపాలిటీలో సమస్యలు పరిష్కరించాలి'

మున్సిపల్ కమిషనర్ సతీశ్‌కుమార్‌కు వినతి పత్రం ఇస్తున్న వినియోగదారుల హక్కుల సంఘం జిల్లా అధ్యక్షుడు పరశురాములు

మోత్కూరు, మార్చి 27 : మున్సిపాలిటీలో నెలకొన్న ప్రజల సమస్యలను పరిష్కరించాలని డిఫెన్స్ వినియోగదారుల హక్కుల సంఘం జిల్లా అధ్యక్షుడు గుమిడెల్లి పరశురాములు కోరారు. స్థానిక సమస్యలపై మున్సిపల్ కమిషనర్ కె.సతీశ్‌కుమార్‌కు గురువారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీలో రోడ్డు విస్తరణ పనులు అస్తవ్యస్తంగా చేస్తున్నారని, పనులు నిబంధనల ప్రకారం చేయడం లేదని అన్నారు. మురుగు కాల్వల నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించడం లేదని ఆరోపించారు. పోతాయిగడ్డలోని అంబేద్కర్ చౌరస్తాలో డివైడర్‌కు ఇరువైపులా ఉన్న సీసీ రోడ్డుపై బీటీ వేసి ఆధ్వాన్నంగా మార్చారన్నారు. నిబంధనలు ఉల్లంఘించి చేసిన పనులకు బిల్లులు చెల్లించవద్దని కోరారు. పలు కాలనీల్లో డ్రైనేజీ నిర్మించాలన్నారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో మర్రి కమల్ నాథ్, సారయ్య, రామకృష్ణ పాల్గొన్నారు.

ఆలేరు ప్రజలకు తాగునీటిని అందించాలి : సీపీఐ

సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ నాయకుడు వెంకటేశ్

ఆలేరు టౌన్, మార్చి 27 : మున్సిపాలిటీ పరిధిలోని పలు కాలనీల ప్రజలకు మిషన్ భగీరథ తాగునీటిని అందించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు చెక్క వెంకటేశ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పట్టణంలో మిషన్ భగీరథ తాగునీరు నాలుగైదు రోజులకోసారి వస్తున్నాయన్నారు. మున్సిపల్ అధికారులకు ఇంటి పన్నులు, ఎల్ఆర్ఎస్‌పై ఉన్న శ్రద్ధ ప్రజలకు తాగునీరు అందించడంలో లేదని మండిపడ్డారు. డ్రైనేజీ పనులను వేగవంతం చేసి ప్రజలను దోమలబారి నుంచి కాపాడాలని కోరారు. ఆలేరు అండర్ పాస్, పెద్ద వాగు వెడల్పు పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. సమావేశంలో నాయకులు గొట్టిపాముల శ్రీనివాస్, బొడ్డు ఆంజనేయులు, తుమ్మల నాగమణి, పూలమ్మ, బాలమణి, జహంగీర్, జానమ్మ, ఆండాలు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయాలి

మోటకొండూర్, మార్చి 27 : ప్రభుత్వ ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బొలగాని సత్యనారాయణగౌడ్, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎల్లంకి మహేశ్ అన్నారు. మండల కేంద్రంలో గురువారం నిర్వహించిన ఏఐవైఎఫ్ మండల మహాసభలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఖాళీ ఉద్యోగాలను భర్తీ చేయకుండా నిరుద్యోగులను మోసం చేస్తుందన్నారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి పేరబోయిన మహేందర్, నాయకులు బాలరాజు, మధు, సునీల్, దేవరాజు, రాములు, పాండు పాల్గొన్నారు.

ఇండ్ల స్థలాలు అడిగితే అరెస్టులా? : సీపీఎం

మోత్కూరు, మార్చి 27 : పేదలకు ఇండ్లు, ఇండ్ల స్థలాలు కావాలని పోరాటం చేసిన వారిపై లాఠీచార్జి చేయడం అప్రజాస్వామికమని సీపీఎం మండల కార్యదర్శి గుండు వెంకటనర్సు అన్నారు. మోత్కూరులో గురువారం విలేకరులతో ఆయన మాట్లాడారు. ఇబ్రహీంపట్నం నాగన్‌పల్లిలో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం సర్వే నంబర్ 189, 203, 577లలో పేదలకు ఇండ్ల స్థలాలు ఇచ్చిందన్నారు. ఆ భూములను రామోజీ ఫిలిం సిటీ యాజమాన్యం కబ్జా చేసి పేదలకు మరోచోట ఇంటి స్థలాలు కేటాయిస్తామని నమ్మించి మోసం చేసిందన్నారు. పేదల భూములు వారికే కావాలని పోరాటం చేసిన సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ, నాయకులపై పోలీసులు అరెస్టు చేయడం హేయమైన చర్య అన్నారు. సమావేశంలో సీపీఎం మండల కమిటీ సభ్యుడు కురిమేటి యాదయ్య పాల్గొన్నారు.

కొమురయ్య జయంత్యుత్సవ కమిటీ

రాష్ట్ర సభ్యుడిగా ఏలేందర్

ఏలేందర్ కురుమ

మోటకొండూర్, మార్చి 27 : తెలంగాణ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్య జయంతిని ఏప్రిల్ 3న రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తుంది. ఇందుకోసం జయంత్యుత్సవ కమిటీని ఏర్పాటు చేసింది. మండల కేంద్రానికి చెందిన తెలంగాణ ఉద్యమకారుడు డాక్టర్ కంకల ఏలేందర్‌ను ఉత్సవ కమిటీ రాష్ట్ర సభ్యుడిగా నియమిస్తూ ప్రభుత్వం గురువారం ప్రకటించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధనలో తన వంతు పాత్ర పోషించినందుకు గుర్తించి ఉత్సవ కమిటీ సభ్యుడిగా ప్రభుత్వం నియమించిందన్నారు. అందుకు సహకరించిన సీఎం రేవంత్‌రెడ్డి, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యకు, సంక్షేమ సంఘాల నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

డూప్లికేట్ ఇక్కత్ వస్త్రాలను అరికట్టాలి

- కేంద్ర జౌళి శాఖ మంత్రి గిరిరాజ్ సింగ్‌కు ఎంపీ చామల లేఖ

భూదాన్ పోచంపల్లి, మార్చి 27 : డూప్లికేట్‌గా తయారు చేస్తున్న పోచంపల్లి ఇక్కత్ వస్త్రాలను అరికట్టి, వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు గురువారం కేంద్ర జౌళి శాఖ మంత్రి గిరిరాజ్‌సింగ్‌కు చేనేత కార్మికుల సమస్యలపై లేఖ రాశారు. పది వేల రూపాయల విలువైన పోచంపల్లి చేనేత పట్టు చీరె రూపంలో రూ.600కే నకిలీ పట్టు చీరెలు తయారు చేసి విక్రయిస్తున్నారని తెలిపారు. డూప్లికేషన్ ఇక్కత్ చీరెలతో మార్కెట్ దెబ్బతింటుందని, దీంతో చేనేత కార్మికులకు ఉపాధి కరువవుతుందని పేర్కొన్నారు. పోచంపల్లి ఇక్కత్ చీరెల నకిలీలను నిరోధించేందుకు 100 కోట్లతో కార్పస్ ఫండ్ ఏర్పాటు చేయాలని కోరారు. ఈ ఫండ్ ద్వారా వచ్చే వడ్డీతో ఒరిజినల్ పోచంపల్లి చేనేత చీరెలను ట్యాగ్ చేయాలని, ప్రచార మాధ్యమాల్లో బ్రాండ్ అంబాసిడర్ ద్వారా విస్తృత ప్రచారం చేపట్టాలని పేర్కొన్నారు. జియోగ్రాఫికల్ ఇండికేషన్ రిజిస్ట్రీ (జీఐఆర్) కింద నమోదుకు రక్షణ లేకుండా పోయిందని, దీంతో కార్మికుల జీవితాలు ప్రశ్నార్థకంగా మారుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

'గుట్ట దేవస్థానం బోర్డు డైరెక్టర్లలో దివ్యాంగులకు అవకాశం కల్పించాలి'

ప్రభుత్వ విప్ ఐలయ్యకు వినతి పత్రం ఇస్తున్న వికలాంగుల సంఘం జిల్లా నాయకులు

మోటకొండూర్, మార్చి 27 : యాదగిరిగుట్ట లక్ష్మీనర్సింహ స్వామి దేవస్థానం బోర్డు డైరెక్టర్లలో దివ్యాంగులకు అవకాశం కల్పించాలని కోరుతూ వికలాంగుల సంఘం జిల్లా అధ్యక్షుడు కొడిదల నరేశ్, నాయకులు గురువారం హైదరాబాద్‌లో ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యకు వినతి పత్రం అందజేశారు. దేవస్థానం బోర్డులో దివ్యాంగులకు అవకాశం కల్పించి డైరెక్టర్లుగా నియమించాలని కోరారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో వికలాంగుల సంఘం నాయకులు అనంతుల ఎల్లారెడ్డి, చల్లా విజయ్‌రెడ్డి, భువనగిరి నరసింహారావు ఉన్నారు.

డీసీపీ అక్షాంశ్‌యాదవ్‌కు సన్మానం

డీసీపీ అక్షాంశ్‌యాద్‌ను సన్మానిస్తున్న సంఘాల నాయకులు

భువనగిరి అర్బన్, మార్చి 27 : డీసీపీ అక్షాంశ్‌యాదవ్‌ను ఎస్సీ, ఎస్టీ, బీసీ సంఘాల నాయకులు డీసీపీ కార్యాలయంలో గురువారం మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. స్థానిక సంస్థల ఎన్నికలు జరుగనున్న క్రమంలో గ్రామాల్లో పోలీస్ పికెట్ ఏర్పాటు చేయాలన్నారు. మత్తు పదార్థాలు విక్రయిస్తున్న ముఠాలపై కఠిన చర్యలు తీసుకోవాలని, రేణుకా ఎల్లమ్మ దేవాలయం చౌరస్తా వద్ద ట్రాఫిక్ సిబ్బందిని పెంచాలని కోరారు. చెడు వ్యసనాలకు బానిసవుతున్న యువతను మంచి మార్గంలో ఉంచేందుకు చర్యలు చేపట్టాలన్నారు. డీసీపీని కలిసిన వారిలో బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మోదీరాందేవ్, బీఎస్పీ రాష్ట్ర నాయకుడు బట్టు రాంచంద్రయ్య, ఎస్సీ, ఎస్టీ, బీసీ సంఘాల నాయకులు కొడారి వెంకటేశ్, ఎడ్ల మహాలింగం, శరత్, ధనుంజయ్, మధు, సాయిరాం, శంకర్, వంశీ, హరికృష్ణ, మహేశ్ పాల్గొన్నారు.

పోస్ట్ మెట్రిక్ ఉపకార వేతనాల దరఖాస్తు గడువు పొడిగింపు

భువనగిరి కలెక్టరేట్, మార్చి 27 : 2024-25 విద్యా సంవత్సరానికి ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో చదువుతున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, మ